




www.manavaarthamirror.com

# మన వార్త మిర్రర్

సోమవారం
24 ఆగస్టు 2026

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

- గచ్చిబౌలి ఆంజనేయనగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత
- నిన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం
- సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్
- ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు
- అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు



గచ్చిబౌలి : రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం

(మిగతా 2వ పేజీలో)




# లండన్‌లో తెలుగు ప్రవాసులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

లండన్, ఆగస్టు 24 : తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సోమవారం ఉదయం తెలుగు డయాస్పోరాతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాసులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. లి'తెలంగాణ రైజింగ్'లికు బలమైన మద్దతుదారులు, అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. తెలంగాణను ప్రపంచస్థాయి ఆర్థిక, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ప్రవాస తెలంగాణవాసులు, తెలుగు సమాజం చురుకుగా భాగస్వామ్యం కావాలని సీఎం ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన తెలుగు సమాజంతో తెలంగాణకు ఉన్న అనుబంధం రాష్ట్రానికి ఎంతో బలమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచానికి తీసుకెళ్లడంతో పాటు, ప్రపంచాన్ని తెలంగాణకు మరింత చేరువ చేసేందుకు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో ప్రవాసుల సహకారం కీలకమని సీఎం వివరించారు. లండన్‌లోని తెలుగు సమాజంతో జరిగిన ఈ సమావేశం తెలంగాణతో ప్రవాసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సాగింది.

## బంగ్లాదేశ్‌లో దారుణం.. రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం హత్య

- రిటైర్డ్ టీచర్, భార్య, ఇద్దరు పిల్లలతో సహా నలుగురిని హతమార్చిన దుండగులు
- డ్రగ్స్ తీసుకుంటుండగా అడ్డుకున్నందుకే ఐ ఈ ఘాతుకం
- ఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు





## పాత పెన్షన్ కోసం ఉద్యోగుల పోరు

- సీపీఎస్ రద్దు చేస్తే మళ్లీ సీఎంగా గెలిపిస్తాం
- రాష్ట్రంలోని 2.6 లక్షల మంది ఉద్యోగుల హామీ
- పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్
- నవంబర్ 17లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని పిలుపు

హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) డిమాండ్ చేసింది. సీపీఎస్ రద్దు చేస్తామని ఐ

(మిగతా 2వ పేజీలో)

## అమెరికా పర్యటన రద్దు.. అండగా నిలిచిన ఖర్గేకు సీఎం కృతజ్ఞతలు

- కేంద్రం అనుమతి నిరాకరించడంతో అమెరికా పర్యటన రద్దు
- లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సీఎం
- ఈ అంశంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కృతజ్ఞతలు
- రాజకీయ కారణాలతోనే పర్యటనను అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపణ
- హైదరాబాద్ చేరుకున్నాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని ప్రకటన



తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభు త్వం 'రాజకీయ కారణాలతో' అనుమతి నిరాకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు బలమైన మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. లండన్‌లో తాను చేపట్టాల్సిన అధికారిక సమావేశాలు, కార్య క్రమాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే,

(మిగతా 2వ పేజీలో)

## టర్కీ నుంచి భారీగా ఆయుధాలు.. పాక్ ఏదో పెద్ద స్కెచ్ వేస్తోందా?



- అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా.
- డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి.

ఢిల్లీ : పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా.? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల మిగతా..2లో

## ఆరోగ్యశ్రీపై ఎందుకంత కక్ష.. రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ధ్వజం




- ఆరోగ్యశ్రీ బకాయిలు, సిబ్బందికి జీతాలు చెల్లించడంలో వైఫల్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు.
- ఆరోగ్యశ్రీపై ఎందుకంత కక్ష అని సీఎం రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు.

హైదరాబాద్: ఆరోగ్యశ్రీ సిబ్బంది ఆవేదన వింటే గుండె కలిచి వేస్తోందని హరీశ్‌రావు అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ, ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల నిధులు విడుదల కాకపోవడంతో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి 18 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. నెలల తరబడి జీతాలు లేకుండా సిబ్బంది ఎలా బతకాలి? వారి కుటుంబాల పరిస్థితి ఏమిటి? మిగతా..2లో

# తాజ్‌పూర్‌లో భక్తిశ్రద్ధలతో ఘనంగా శ్రావణమాసం బోనాల మహోత్సవం



-గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుచుకోవడం ఆనవాయితీ- సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్



యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో బోనాల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, శివశక్తుల శిగలతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించుకుని, తలపై బోనాలతో ఊరేగింపుగా గ్రామంలోని గ్రామదేవతల ఆలయాల వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో ఎలాంటి కష్టాలు, అనారోగ్యాలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనాలని భక్తులు కోరుకున్నారు.

## గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష -శ్రీనివాస్ మాట్లాడుతూ.

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోందని, ప్రతి ఏటా గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు సర్పంచ్ తెలిపారు.

## గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

డప్పు చప్పుళ్లు, శివశక్తుల నృత్యాలతో తాజ్‌పూర్ గ్రామంలో పండుగ సందడి నెలకొంది.భక్తిశ్రద్ధలతో సాగిన బోనాల వేడుకలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్ మరియు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.



## రాజన్న నాయకత్వం లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

### -రెండవ సారి మహ్మదాబాద్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నల్లబోతు సురేష్ యాదవ్



సంస్థాన్ నారాయణపురం, మన వార్త మిర్రర్ మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మహమ్మదాబాద్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండవసారి నియమితుడైన నల్లబోతు సురేష్ యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా రెండవసారి నియమితుడైన సురేష్ యాదవ్, డీ సీ సీ అధ్యక్షుడు బిర్లా ఐలయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా స్థానిక శాసనసభ్యులు రాజగోపాల్ రెడ్డి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

# రష్యాలో డ్రోన్ దాడి.. భారత వైద్య విద్యార్థికి గాయాలు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, రష్యాలోని ఉఫా నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ విద్యార్థి గాయపడ్డారు. ప్రస్తుతం బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉఫాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఈ విద్యార్థిపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) తక్షణమే స్పందించింది. గాయపడిన విద్యార్థితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సదరు విద్యార్థికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచారు. గత మూడు రోజులుగా రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, మాస్కోకు సుమారు 1,200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కీలక పారిశ్రామిక నగరం ఉఫా లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. ఇక్కడి చమురు శుద్ధి కర్మాగారంపై సైతం దాడులు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

# కొత్త పార్టీ పెడుతున్నా..

మాజీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు. వైసీపీలోకి తిరిగి వెళ్తారంటూ జోరుగా సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కొత్త పార్టీకి శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి వివరించారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకను వినిపించేందుకే కొత్త పార్టీ పెడుతున్నానని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తానని తెలిపారు. దేశం ఎల్‌నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని నెలలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పలు జాతీయ, రాష్ట్ర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందిస్తూ.. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే 'భారత్ జన వికాస్' పేరుతో ఆయన పార్టీ పెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తాజాగా తిరుమలలో ఆయన చేసిన ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే సొంత జెండాతో ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమైంది.

# ఎన్నికలకు సిద్ధంకండి..

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?

తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.

## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచారు: ఎస్పీ వెల్లడి

నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. విలాసాలకు అలవాటు పడిన ఇద్దరు మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు నిర్ధారించారు. నిందితుల్లో ఒకరు ఆమెను ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేసేందుకు ఇద్దరు విద్యార్థులు పథకం రచించారు. అందులో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, ప్రమాదవశాత్తు మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టారు. దీంతో భయాందోళనకు గురైన నిందితుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. 27 సార్లు పొడిచి చంపిన అనంతరం, ఆమె ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సత్తా చాటాలి

కాంగ్రెస్ సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్టానం ముఖ్యమంత్రులకు మాట్లాడే అవకాశం ఇవ్వగా, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ వ్యూహాలు, జాతీయ స్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి కీలకమైన రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహించేందుకు తెలంగాణకు చెందిన ముఖ్య నాయకులు, పీసీసీ ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారన్నారు. అధిష్టానం ఆదేశిస్తే.. పార్టీ విజయంలో కీలక భూమిక



## సూరజ్ నగర్ ఫేస్-3 నూతన కమిటీ ఎన్నిక

తుర్కయంజాల్, వార్త మిర్రర్ :

సూరజ్ నగర్ కాలనీ ఫేస్–3 నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.నూతన కమిటీ సభ్యులుగా అధ్యక్షుడు తెలగమల్ల కృష్ణ, ఉపాధ్యక్షులు గుండాల రమేష్ గౌడ్, డి. నర్సింహా, సెక్రటరీ యూ. రాజశేఖర్ యాదవ్, జాయింట్ సెక్రటరీ సి.హెచ్. జగన్, ట్రెజరర్ పి. రామకృష్ణ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారంతో పనిచేస్తానని చెప్పారు. కాలనీలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని, అందరి సహకారంతో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. తనను ఎన్నుకున్న కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షుడు కృష్ణతో పాటు నూతన కమిటీ సభ్యులందరితో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. కాలనీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరి సూచనలు, సహకారంతో కాలనీ ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు కాలనీ వాసులు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి మరింత చురుగ్గా పనిచేయాలని ఆకాంక్షించారు.




## ఒడ్డె లింగాపూర్ లో శ్రీరామ హృదయ కలశ, శ్రీరామ పాదయాత్ర...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 23

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ గ్రామంలో వికాస తరంగిణి, ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్ర–శ్రీరామ పాదయాత్ర ఘనంగా నిర్వహించారు. గ్రామ నాయకులు బండారి సాయిరాజ్, గడ్డం రాజారెడ్డి, వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్ పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ, నాగుల రమేష్ తదితరులు శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటంతో గ్రామపంచాయతీ నుంచి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు జై శ్రీరామ్ నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు. ఇటీవల కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యుల చేతుల మీదుగా జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వారి జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకున్న చెరుకు మహేశ్వర శర్మను, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ను నాయకులు బండారి సాయిరాజ్, గడ్డం రాజారెడ్డి నాగుల రమేష్, గ్రామస్థులు, వికాస తరంగిణి బాధ్యులు, ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, లోకకల్యాణం, ధర్మస్థాపన, ధర్మపాలకుల రక్షణ జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడిగా అరవింద్ చందుపట్ల



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్ట్ 23..: భారతీయ జనతా పార్టీ సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడిగా అరవింద్ చందుపట్ల నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యత అప్పగించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీ డా. కె. లక్ష్మణ్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డికి అరవింద్ చందుపట్ల కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సీతాఫల్‌మండి డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకుని ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ బాధ్యతను పదవిగా కాకుండా ప్రజలకు, పార్టీకి సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని అరవింద్ చందుపట్ల పేర్కొన్నారు.



## శ్రీ నవదుర్గ సేవ సమితి నూతన కమిటీ ఎన్నిక

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 23

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లో శ్రీ నవదుర్గ సేవ సమితి 25వ ( సిల్వర్ జూబ్లీ) ఉత్సవ నూతన కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ నవదుర్గ సేవ సమితి అధ్యక్షుడుగా శ్రీరాములు సాయికిరణ్, ఉపాధ్యక్షులుగా గొల్లవత్తిని కృష్ణభరత్, ప్రధాన కార్యదర్శి భూర్ల గోపి, కోశాధికారి మోర చైతన్య, ప్రచార కార్యదర్శి మ్యాకల భాను సంయుక్త కార్యదర్శులుగా జోపువార్ మధు, మానాల రాము, సంయుక్త కోశాధికారులు అనుమల్ల సాయికృష్ణ, గట్టు నవీన్, సంయుక్త ప్రచార కార్యదర్శులు, ఆకు నర్సయ్య, రేగొండ వంశీకృష్ణ, నరంశెట్టి మనోజ్, కట్టెకోల రాజుకుమార్, సుంటిగికర్ భరత్, వాసం ఫణిదర్, సిరిపురం రవి, సంగ రాము, వాసం అరుణ్, తోట అన్వేష్, రాడం ధనుంజజయ్, గౌరవ సలహాదారులు గట్టు వినయ్, ముంజ సుజిత్, మాచర్ల మారుతి, బొమ్మకంటి నవీన్, ఎలిగేటి ఆనంద్, సాంబార్ శ్రీధర్, సాంబార్ రంజిత్, రాచకొండ సురేష్, అంకం శ్రీకర్ లు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ ఈ సంవత్సరం సిల్వర్ జూబ్లీ కావున 25 వ సంవత్సర నవరాత్రులలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలు అన్నీ కూడా అంగరంగ వైభవంగా నిర్వహించాలని నూతన కమిటీ నిర్ణయించింది.

## ఏకాదశి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..

### స్వామి వారికి పంచామృత అభిషేకం, ముడుపు సమర్పణ ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఆగస్టు23

ఆదివారం భానువాసరే శ్రావణ మాసం శుక్ల పక్షం ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం సూర్య భగవానుని విశిష్టత : ఆదివారం -- సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది. తదనంతరం సూర్య భగవానునికి భక్తులు ముడుపులు కట్టారు. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, సహాయ



కోశాధికారి గోపి, భారతాల రాజసాగర్, వేముల రాజేష్, గాజుల మహేష్ –మాధవి, ప్రవీణ్ కుమార్, హరికృష్ణ, వేముల రాజేష్, రవి –సునీత, యాంసాని శంకరయ్య, ఆడెపు శ్రీనివాస్ – అనురాధ, ప్రవీన్ కుమార్, మారుతి, అలిమేలా సత్యనారాయణ, సిరిపురపు గంగాధర్ అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## విశాల్ కు అండగా.. విశ్వశాంతి కుటుంబం

### పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల ఆర్థిక సాయం గాయపడిన విశాల్ ను ఆదుకోవాలని దాతలకు వినతి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 23

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ఒడ్డెర కాలనీకి చెందిన శామిల్, రాధ దంపతులకు ఏకైక కుమారుడు అయిన తేళ్ల విశాల్ విశ్వశాంతి స్కూల్ లో చదివి గత సంవత్సరం పదవతరగతి పాస్ అయ్యాడు. దినసరి కూలి అయిన తన తండ్రితో పాటు విశాల్ కూడా పనికి వెళ్లడం జరిగింది. ప్రమాదవశాత్తు గత సోమవారం గోడ తన మీద పడి తలకి తీవ్ర గాయం కావడం వలన కరీంనగర్ లోని ఒక ప్రైవేటు హాస్పిటల్ కి తరలించగా దాదాపు 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. వెంటనే స్పందించిన పాఠశాల యాజమాన్యం మచ్చ గంగాధర్ – లలిత రూ.10,000/– (పదివేల రూపాయలు) వైద్య



ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేశారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 2000–01 బ్యాచ్ వారు రూ.12,000/–,ఈ విద్యాసంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు వైద్య ఖర్చుల కోసం మానవతా దృక్పథంతో తమవంతు సహాయంగా రూ.10,000/– పాఠశాల యాజమాన్యం సమక్షంలో కుటుంబ సభ్యులకు అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన విశాల్ తల్లిదండ్రులు కూలీ పని చేస్తేనే తమ కుటుంబం గడుస్తుంది, అలాంటివారికి ఈ వైద్య ఖర్చులు పెనుబారంగా మారాయి, కాలనీలో అందరితో కలిసి మెలిసి అల్లారు ముద్దుగా ఉండే విశాల్ ని దక్కించుకునేందుకు కాలనీవాసులు స్వయంగా భిక్షాటన చేయడం పరిస్థితికి అద్దం పడుతుంది. దాతలు మానవతా హృదయాలు స్పందించి విశాల్ వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం చేయలని పాఠశాల యాజమాన్యం వారు కోరారు. ఎవరైనా సహాయం చేయాలనుకున్నవారు 8008192221 నెంబర్ కి ఫోన్ పే చేయగలరు.

## తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది

### జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 23

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన మోర వందన–అజయ్, మోర సోనీ–విజయ్, భోగ నాగమణి–రాజన్న ల కు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు హాజరై ఇందిరమ్మ ఇళ్లు ను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, మీ కుటుంబాల ఆనందాన్ని పంచుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం కల. ఆ కల నెరవేరిన ఈ రోజు మీ అందరికీ హృదయపూర్వక అభినందనలు. తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన గృహం కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. జగిత్యాల నియోజకవర్గంలో కూడా ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తున్నాం. ఇల్లు నిర్మించడం మాత్రమే కాదు, తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించి ప్రతి వార్డు ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యం అన్నారు. రాయికల్ పట్టణంలో అమృత్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి తాగు నీరు



అందించే విదంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, తాగు నీటి కొరత తీరనుంది అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాయికల్ పట్టణం అభివృద్ధి కి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు, అచ్యుత్ రావు, పాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, పురుషోత్తం, మచ్చ శేఖర్, రాయికల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం రాజేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రావు, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, మురళి, యూత్ నాయకులు రామ్మూర్తి రాజేష్, శివ, జిల్లా పార్టీ ఉప అధ్యక్షులు ముఖీద్, డా.సుమన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో కొలువుదీరిన పోచమ్మ తల్లి

కల్వకుర్తి ఆగస్టు 23 వార్త మిర్రర్ ప్రతినిధి:–

తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్‌లతో కలిసి ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ఖానాపూర్ గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.గ్రామాల్లో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్, ఆలయ నిర్మాణ దాత గోకికార్ రమేష్, మార్కెట్ యార్డు ఛైర్మన్ యాట గీత నరసింహ, పార్టీ మండల అధ్యక్షుడు కాసు



శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బొజ్జ వెంకట్రామ్ రెడ్డి, నరసింహ, మాజీ ఎంపీటీసీ గణేష్ గుప్తా తదితరులతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కల్వకుర్తి ఆగస్టు 23 వార్త మిర్రర్ ప్రతినిధి:–

కల్వకుర్తి పట్టణంలో ఈ నెల 26న నిర్వహించనున్న పవిత్ర మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు (జులూస్)ను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కల్వకుర్తి పోలీసులు సూచించారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినం సందర్భంగా నిర్వహించే ఈ వేడుకలు శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.జులూస్‌ను నిర్ణీత సమయానికి ప్రారంభించి, నిర్దేశిత గడువులోగా ముగించాలని నిర్వాహకులకు సూచించారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీజేలు, అధిక శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు.మైనర్లతో వాహనాలు నడిపించడం, బైక్‌ల పై ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి ర్యాష్ డ్రైవింగ్ చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. నిర్ణీత తేదీకి ముందు ఎలాంటి బైక్ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ దీపాలంకరణల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, జెండాలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్నదాన కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వలంటీర్లు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని కోరారు.అలాగే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై నిరంతర నిఘా ఉంటుందని పోలీసులు తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపైనా ప్రత్యేకంగా నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలను అందరూ పరస్పర సహకారంతో శాంతియుతంగా నిర్వహించాలని పోలీసులు కోరారు.



# సరుకు రవాణా రంగంలో సరికొత్త విప్లవం

## ఈజెడ్ మూవ్ సేవల ప్రారంభం
## డ్రైవర్ల సంక్షేమమే ధ్యేయంగా సరికొత్త యాప్ రూపకల్పన

వార్త మిర్రర్, మల్కాజిగిరి :నగరంలో సరుకు రవాణా సేవలను మరింత వేగవంతం, సులభతరం చేసేందుకు ఈజెడ్ మూవ్ సంస్థ సరికొత్త రవాణా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ను సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ మల్కాజిగిరిలోని జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్లో జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంతో పాటు, ప్రధానంగా డ్రైవర్ల సంక్షేమం, వారి ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, పూర్తిస్థాయి కస్టమర్ సేవలు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.సాంప్రదాయ కమీషన్ పద్ధతులకు స్వస్తి పలుకుతూ, డ్రైవర్ల కోసం అతి తక్కువ రీఛార్జ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టారు. ప్రతి డ్రైవర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా, 2 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో వచ్చే సర్ఛార్జ్ మొత్తం ఎలాంటి కోతలు లేకుండా నేరుగా డ్రైవర్‌కే అందుతుంది.అవుట్‌స్టేషన్, రాత్రి ప్రయాణాలకు డ్రైవర్లే స్వయంగా బిడ్డింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీనిపై సంస్థ ఎలాంటి రుసుము వసూలు చేయదు. కస్టమర్ లొకేషన్‌కు 4 నుంచి 10 కి.మీ వెళ్లిన తర్వాత




రైడ్ క్యాన్సిల్ అయితే, ఆ డీజిల్ ఖర్చును సంస్థే భరిస్తుంది. టోల్ ఫీజులు, ఇతర పన్నులను నిబంధనల ప్రకారం కస్టమర్లే చెల్లించాల్సి ఉంటుంది. ఈ సంస్థ పూర్తిగా సరుకు రవాణాకు మాత్రమే పరిమితం. టూ-వీలర్స్, 3-వీలర్ గూడ్స్ ఆటోలు, అలాగే 8, 9, 10 అడుగుల భారీ గూడ్స్ వాహనాలు ఇందులో అందుబాటులో ఉంటాయి. ప్యాసింజర్ వాహనాలకు ఇందులో అనుమతి ల

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలి: షాహినా.

## -విద్యార్హతలు, వయస్సు అడ్డంకులు కావు-
## -ఎలక్ట్రిక్ వాహన రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపు-



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 23:
మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఏడిఎంఎస్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, సృజనాత్మక సంచాలకురాలు షాహినా పిలుపు నిచ్చారు. విద్యార్హతలు, వయస్సు ఎదుగుదలకు అడ్డంకులు కావని, నిరంతరం నేర్చుకోవడం, క్రమశిక్షణ, సమయపాలన, తెలివైన శ్రమతో లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. ఎలక్ట్రిక్ వాహన రంగంలో పెరుగుతున్న అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మేదరపేటలో ధర్మపురి బృందం ఆధ్వర్యంలో ఏడిఎంఎస్ సంస్థ నెట్‌వర్క్‌లోని వివిధ విభాగాల సభ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ భారతీయ ప్రధాన కమిటీ సభ్యుడు పి. సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాలు, డప్పు చప్పుళ్లతో షాహినాకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళల ఆర్థిక అభివృద్ధిపై షాహినా ప్రత్యేకంగా దృష్టి సారించారు. మహిళ తన విలువను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకూడదని అన్నారు. “వంద రూపాయల నోటు ఎక్కడ పడినా, దానికి ఎలాంటి మురికి అంటినా దాని విలువ మారదు. అలాగే మహిళ కూడా జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తన విలువను, ఆత్మవిశ్వాసాన్ని కాపాడుకోవాలి” అని సూచించారు. ఏడిఎంఎస్ సంస్థలో ఆర్థికంగా ఎదగడానికి వయస్సు, విద్యార్హతలు ప్రామాణికాలు కావని, నేర్చుకోవాలనే తపన, క్రమశిక్షణ, తెలివైన శ్రమ, పట్టుదల ఉంటే అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు. మహిళలు సంస్థ కార్యకలాపాలపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు. సంస్థకు సంబంధించిన విషయాలను నేర్చుకోవడానికి మహిళలు కర్ణాటక రాష్ట్రంలోని బెలగావి ప్రధాన కార్యాలయానికి వస్తే అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు సంస్థ తరఫున సహకరిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే తమలోని ప్రతిభను గుర్తించి ఆర్థికంగా ఎదగడానికి మహిళలు కృషి చేయాలని సూచించారు. ఏదైనా లక్ష్యాన్ని సాధించే క్రమంలో విమర్శలు, నిరుత్సాహపరిచే మాటలు, అవరోధాలు ఎదురవుతాయని, వాటికి భయపడి వెనుకడుగు వేయకూడదని షాహినా అన్నారు. గమ్యాన్ని నిర్దేశించుకుని ఎదురయ్యే సమస్యలను అధిగమిస్తూ నిరంతరం ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను



చేరుకోవచ్చని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణను అవకాశంగా మలుచుకోవాలని ఆమె అన్నారు. ఏడిఎంఎస్ సంస్థ కార్యకలాపాలను కేవలం వాహనాల విక్రయాలకే పరిమితం చేయకుండా వినియోగదారులకు సరైన సమాచారం, నాణ్యమైన సేవలు అందించే విధంగా నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సంస్థ పలు రాష్ట్రాల్లో ప్రదర్శనశాలల ద్వారా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయ కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెట్‌వర్క్‌లో పనిచేసే ప్రతి సభ్యుడు సంస్థ ఉత్పత్తులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని షాహినా సూచించారు. వాహనం పనితీరు, బ్యాటరీ సామర్థ్యం, ప్రయాణ పరిధి, విద్యుత్ నింపే విధానం, నిర్వహణ, హామీ కాలం తదితర అంశాలపై స్పష్టమైన సమాచారాన్ని వినియోగదారులకు అందించాలన్నారు. తప్పుడు హామీలు, అతిశయోక్తులకు తావివ్వకుండా పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని పొందాలని సూచించారు. సభ్యుల సంఖ్య కంటే చురుకుగా పనిచేసే సభ్యులే సంస్థకు నిజమైన బలమని షాహినా పేర్కొన్నారు. వినియోగదారులను కలవడం, ఉత్పత్తులపై అవగాహన కల్పించడం, తదుపరి సంప్రదింపులు కొనసాగించడం, శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అంశాలకు ప్రతి సభ్యుడు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. “ప్రేరణ మనల్ని ప్రారంభిస్తుంది. క్రమశిక్షణ, నిరంతర కృషి మనల్ని విజయానికి తీసుకెళ్తాయి” అని పేర్కొన్నారు. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదని, ముందుండి పనిచేస్తూ బృందానికి ఆదర్శంగా నిలవడమేనని షాహినా అన్నారు. ప్రతి సభ్యుడు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని కొత్త సభ్యులకు సరైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, నెట్‌వర్క్ బలోపేతం, వినియోగదారుల సేవలు, ఉత్పత్తులపై అవగాహన, సంస్థ కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో సంస్థకు చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు, ప్రధాన కమిటీ సభ్యులు, ధర్మపురి బృందం సభ్యులు, నెట్‌వర్క్ సభ్యులు పాల్గొన్నారు.

# తార్నాకలో ఏబీఆర్ఎస్ఎం కార్యాలయం ప్రారంభం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 23:
సికింద్రాబాద్ తార్నాకలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేద్కర్, కర్ణాటక కేంద్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి బట్టు సత్యనారాయణ, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి మహేంద్ర కపూర్, సంయుక్త సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్, మురళీ మనోహర్ తదితరులు హాజరయ్యారు.విద్య, పరిశోధన రంగాల అభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యకర్తలు,
వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలు విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యాలయ ప్రారంభానికి కృషి చేసిన జగన్, రాజిరెడ్డి, సుజాత, స్వప్న, భాస్కర్, ప్రవీణ్, సోమేశ్, కవిత,



వివేక్, సుమన్, తిరుపతిరెడ్డి, ఉపేంద్ర, రామకృష్ణ, కవిత, చిత్తరంజన్, సంపత్, లోకేష్ తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా ‘ఉత్తమ గురు పురస్కారం’ అందుకున్న మురళీ గురుస్వామి..

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్టు 23హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ‘శ్రీ మహాశాస్త్ర సేవా సంఘం’ ఆధ్వర్యంలో ఆదివారం గురు పురస్కార అవార్డు మహోత్సవం వైభవంగా నిర్వహించడం జరిగింది. సంఘం వ్యవస్థాపకులు సూదగాని రాజు గురుస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్పస్వామి దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ బొబ్బిళ్ళ మురళీ గురుస్వామి ‘ఉత్తమ గురు పురస్కారం’ అందుకున్నారు. ?సాక్షాత్ అయ్యప్ప వంశస్థులు, శబరిమలైకి చెందిన పందల రాజకుటుంబీకులు తిరునాల్ సురేష్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును మురళీ గురుస్వామికి బహుకరించారు. ఆధ్యాత్మిక సేవలో విశేష కృషి చేస్తున్నందుకు గాను మురళి గురు స్వామి కు ఈ గౌరవం దక్కింది.?ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు గురుస్వామి, ప్రదీప్ తంత్రి గురుస్వామి, తంగవేలు సంతోష్ గురుస్వామి, భరణి వెంకటేష్ గురుస్వామి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విచ్చేసిన 118 మంది గురుస్వాములకు ఈ సందర్భంగా గురు పురస్కారాలు, అన్నపూర్ణ అవార్డులను ప్రధానం చేశారు...




## పంతంగి శివారులో యువకుడు దారుణ హత్య
## రంగంలోకి దిగిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఆగస్ట్ 23
చౌటుప్పల్ మండలం లోని పంతంగి గ్రామంలోని చనగలగుట్ట వద్ద అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య,తండ్రి,వెంకయ్య, వయస్సు 36 సంవత్సరాలు,వడ్డెర కులం, వృత్తి: వ్యవసాయం హత్యకు గురైనట్లు సమాచారం అందింది.సమాచారం అందిన వెంటనే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించేందుకు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు.క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ద్వారా సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారు.ఈ ఘటనపై అవసరమైన చట్టపరమైన చర్యలు చేపడుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేసి, హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడించబడతాయి.



## చలికాలంలో గుండెపోటు ప్రమాదం
## ఎందుకు పెరుగుతుంది? అసలు కారణాలు ఇవే!



చలికాలంలో శరీరం ఇప్పటికే వెచ్చగా ఉండటానికి జీవక్రియను పెంచడానికి ప్రయత్నిస్తుంది. మనం మార్నింగ్ వాక్ చేయవలసి వస్తే ఉదయం చలి నుండి మనల్ని మనం రక్షించుకోవాలి. మన తల, చెవులు, చేతులు, కాలి వేళ్లను కప్పుకోవాలి. మీ ఛాతీ.. గుండెపోటు వచ్చిందంటే చాలు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. కొన్ని సార్లు ఒక్కసారి వచ్చిన గుండెపోటుతోనే మరణాలు సంభవిస్తుంటాయి. ఒకసారి వచ్చి వెళ్లిందంటే జాగ్రత్తగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు వైద్య నిపుణులు. ఈ మధ్య కాలంలో గుండెపోటు వచ్చేవారి సంఖ్య పెరిగిపోతోంది. ఉన్నట్టుండి గుండె పోటు వచ్చి కుప్పకూలిపోతున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. గుండెపోటు రాగానే నిమిషాల్లో ఆస్పత్రికి చేరిస్తే గోల్డెన్ అవర్స్‌గా భావిస్తారు. ఇక చలికాలంలో గుండె సమస్యలు పెరుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులున్నవారు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఉదయాన్నే చలి మీ గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ప్రత్యేకించి ఎవరైనా వార్మప్ లేకుండా వ్యాయామం చేస్తే లేదా సరిగ్గా దుస్తులు ధరించకపోతే ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. ఎపినెఫ్రిన్, నోర్‌పైన్‌ఫ్రైన్, కార్టిసాల్ వంటి కొన్ని హార్మోన్ల స్రావం పెరగడం వల్ల చాలా వరకు గుండెపోటులు ఉదయం 4 నుండి 10 గంటల మధ్య వస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి ఆక్సిజన్ డిమాండ్, రక్తపోటు పెరుగుదలను ప్రేరేపిస్తాయి. ఇది కాకుండా ఎండోథెలియల్‌ప్రొజెనిటర్ కణాల స్థాయి తగ్గడం కూడా గుండెపోటు అవకాశాలను పెంచుతుంది.

## శీతాకాలంలో డి-విటమిన్ లెవెల్స్
## పెంచే 3 ఫుడ్ సీక్రెట్స్! ఎండతో పనేలేదు




ఆరోగ్యానికి అత్యంత అవసరమైన పోషకాల్లో విటమిన్-డి కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ఎముకల బలానికే కాకుండా, కాల్షియం, ఫాస్ఫరస్‌లను శరీరం గ్రహించేలా చేసి, రోగనిరోధక వ్యవస్థను శక్తివంతం చేస్తుంది. విటమిన్-డి మన మానసిక స్థితిని, శక్తి స్థాయిలను కూడా ప్రభావితం చేస్తుంది. అయితే, చలికాలంలో సూర్యరశ్మి తక్కువగా దొరుకుతున్నందున, కేవలం ఎండపైనే ఆధారపడకుండా, విటమిన్-డి స్థాయిలను పెంచుకునేందుకు ఆహార మార్గాలు తప్పనిసరి. విటమిన్-డి లోపం చాలా నెమ్మదిగా మొదలవుతుంది. అందుకే అలసట, బలహీనమైన ఎముకలు వంటి లక్షణాలు త్వరగా కనిపించవు. వృద్ధులు, రాత్రి షిఫ్టుల్లో పనిచేసేవారు, ఎక్కువగా ఇళ్లలోనే గడిపేవారు, నలుపు రంగు చర్మం ఉన్నవారు, పూర్తిగా శాకాహారం తీసుకునేవారు ఈ లోపానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఈ లోపం రాకుండా చూసుకోవాలంటే, నిత్యం కొన్ని ఆహార మార్పులు చేసుకోవడం ఉత్తమం.కొవ్వు చేపలు, పుట్టగొడుగులే కీలకంసూర్యరశ్మి సరిగా లేనప్పుడు ఆహారమే ప్రధాన ఆధారం. సాల్మన్, ట్యూనా, మాకరెల్ వంటి కొవ్వు అధికంగా ఉన్న చేపల్లో విటమిన్-డి పుష్కలంగా లభిస్తుంది. ఈ చేపలను వారానికి కనీసం ఒకటి రెండు సార్లు తీసుకుంటే, శరీరానికి కావాల్సిన విటమిన్-డి మోతాదు సులువుగా అందుతుంది. అంతేకాదు, వీటిలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు, గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శాకాహారులకు అత్యుత్తమ మార్గం పుట్టగొడుగులు (మష్రూమ్స్). కొన్ని రకాల పుట్టగొడుగులు కిరణాలకు గురైనప్పుడు విటమిన్-డి2ను ఉత్పత్తి చేస్తాయి. అలాగే, గుడ్డు పచ్చసొనలోనూ కొంతమేర విటమిన్-డి నిల్వ ఉంటుంది. రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవడం ద్వారా లోపాన్ని అధిగమించవచ్చు. ఫోర్టిఫైడ్ ఆహారాలు, పరీక్షలుసహజంగా విటమిన్-డి నిల్వ లేని కొన్ని ఉత్పత్తులకు అదనంగా దీన్ని జోడించి అమ్ముతారు. వీటినే ‘ఫోర్టిఫైడ్ ఆహారాలు’ అంటారు. విటమిన్-డి కలిపిన ఆవు పాలు, మొక్కల ఆధారిత పాలు, పెరుగు, సిరియల్స్, నారింజ రసం వంటివి అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనేముందు, లేబుల్‌పై విటమిన్-డి చేర్చబడినట్లు నిర్ధారించుకోవాలి.

## ఉదయాన్నే గుడ్డు తినేవారికి
## అలర్ట్.. ఇలా చేస్తే బలం కాదు బద్ధకం వస్తుంది!



ఉడికించిన గుడ్డు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో లేదా రోజులో ఎప్పుడైనా తీసుకునే అత్యంత ఆరోగ్యకరమైన ఆహారం. గుడ్లు పూర్తి పోషకాల నిధి. అయితే, మీరు తరచుగా చేసే ఒక చిన్న తప్పు మీ ఆరోగ్యానికి పెను ప్రమాదంగా మారవచ్చు. మీరెంతో ఇష్టపడి, ఆరోగ్యం కోసం తీసుకునే ఉడికించిన గుడ్లను, కొన్ని ఆహార పదార్థాలతో కలిపి లేదా వెంటనే తీసుకుంటే... అవి మేలు చేయాల్సింది పోయి, మీ జీర్ణవ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేస్తాయి. గుడ్లతో పాటు ఏయే ఆహారాలను తీసుకోకూడదో, ఈ డేంజరస్ కాంబినేషన్ల గురించి నిపుణులు ఏం చెబుతున్నారో వివరంగా తెలుసుకుందాం! గుడ్లు పోషక విలువలు అధికంగా ఉన్న అద్భుతమైన ఆహారం. చలికాలంలో ఇవి శరీరాన్ని వెచ్చగా ఉంచుతాయి కూడా. అయితే, గుడ్లను కొన్ని రకాల ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవడం వలన లేదా గుడ్లు తిన్న వెంటనే వాటిని తీసుకోవడం వలన జీర్ణవ్యవస్థకు భంగం కలిగి, మొత్తం ఆరోగ్యానికి హానికరం అవుతుంది. ఈ ప్రతికూల కలయికలను నివారించడం చాలా ముఖ్యం.గుడ్లు తిన్న తర్వాత తీసుకోకూడని ముఖ్యమైన పదార్థాలు1. సోయా పాలు సోయా పాలలో కూడా ప్రోటీన్ అధికంగా ఉంటుంది. గుడ్లు, సోయా పాలను కలిపి తీసుకుంటే, జీర్ణవ్యవస్థపై ప్రోటీన్ లోడ్ పెరుగుతుంది. ఇది ప్రోటీన్ శోషణకు ఆటంకం కలిగించి, జీర్ణ సమస్యలకు మరియు అసౌకర్యానికి దారితీస్తుంది.